క్లుప్తంగా

బీజేపీకి 7,127 ఓట్లు


నవీన్‌కుమార్

అనంతగిరి: 2023 శాసన సభ ఎన్నికల్లో వికారాబాద్ బీజేపీ అభ్యర్థి పెద్దింటి నవీన్‌కుమార్‌కు 7,127 ఓట్లు పోలయ్యాయి. దీంతో ఆయన మూడో స్థానంలో నిలిచారు. గత ఎన్నికల్లో ఆ పార్టీకి రెండు వేల లోపు ఓట్లు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజా తీర్పును శిరసావహిస్తామని చెప్పారు. తన గెలుపు కోసం పనిచేసిన పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు.

ధాన్యం కొనుగోలులో జాప్యం

బొంరాస్‌పేట: రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుస్స చంద్రయ్య కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం మాట్లాడారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతులు.. వారు పండించిన వరిధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు జాప్యం చేస్తున్నారని, దీని వలన దిగుబడిని కాపాడుకోలేక కర్షకులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

సంగెంకలాన్‌లో పైలెట్‌కు ఆధిక్యం

తాండూరు రూరల్: తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్ ఇలాకాలో బీఆర్‌ఎస్ ఆధిక్యం సాధించింది. ఇక్కడ మొత్తం 1600 ఓట్లు ఉండగా.. ఇందులో 1270 ఓట్లు పోలయ్యాయి. వాటిలో కాంగ్రెస్‌కు 523, బీఆర్‌ఎస్‌కు 647 ఓట్లు పడ్డాయి. దీంతో 124 ఓట్లు ఆధిక్యంతో పైలెట్ రోహిత్‌రెడ్డి ముందున్నారు.

ప్రజల మధ్యే ఉంటా

- కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి
- ఓడిపోయానని అధైర్య పడొద్దు కార్యకర్తలకు సూచన



మహేశ్వరం: ఎన్నికల్లో ఓడి పోయినా.. నియోజకవర్గ ప్రజల మధ్యే ఉంటూ సేవ చేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆదివారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. తనకు ఓటు వేసిన కార్యకర్తలు, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. ఎన్నికల్లో అతి తక్కువ సమయంలో చాలా మంది మద్దతుగా నిలవడం ఆనందంగా ఉందని వెల్లడించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరేలా చూస్తానని చెప్పారు. పదవులతో సంబంధం లేకుండా మహేశ్వరం నియోజకవర్గ ప్రజల సంక్షేమం, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. తాను ఓడిపోయానని పార్టీ శ్రేణులు అధైర్యపడవద్దని, అపజయం విజయానికి నాంది అని చెప్పారు. ఓడినా ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారు.

ప్రజా తీర్పును గౌరవిస్తా!

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా తీర్పును శిరసావహిస్తామని, ఓటమికి కుంగిపోకుండా రెట్టింపు ఉత్సాహంతో నిరంతరం ప్రజాసేవలో ముందు ఉంటానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఆదివారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటానని చెప్పారు. ఈ పోరాటంలో తన వెన్నంటి నడిచిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని, ఏ ఆపద వచ్చినా నేను ఉన్నాననే విషయాన్ని మరిచి పోవద్దని కార్యకర్తలను ఉద్దేశించి చెప్పారు. తనకోసం పనిచేసిన వారిని మరిచిపోనని పేర్కొన్నారు. ఈ ఓటమి భవిష్యత్తులో తన గెలుపునకు నాంది పలుకుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటానని, మీరు చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

జిల్లాలో హస్తం హవా

2023 సాధారణ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోనూ అదే తీర్పును ఇచ్చారు. ఈ జడ్జిమెంట్‌తో తాండూరులో బుయ్యని మనోహర్‌రెడ్డి, వికారాబాద్‌లో గడ్డం ప్రసాద్‌కుమార్, పరిగిలో తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి (టీఆర్‌ఆర్), కొడంగల్‌లో రేవంత్‌రెడ్డిలు.. సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థులపై భారీ మెజార్టీతో విజయభావుటా ఎగురవేశారు. దీంతో హస్తం శ్రేణుల సంబురాలు అంబరాన్నంటాయి. విజయానందంతో బాణసంచాలు కాల్చారు. మిఠాయిలు తినిపించుకున్నారు.

- నాలుగు చోట్లా విజయదుందుభి
- మిన్నంటిన కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు


బొంరాస్‌పేట: దుద్యాలలో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు


మోమిన్‌పేట: మిఠాయి తినిపించుకుంటున్న నేతలు

మోమిన్‌పేట: కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ నియోజకవర్గ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్.. సమీప ప్రత్యర్థి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆనంద్‌పై ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో ఆ పార్టీ శ్రేణులు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు నరోత్తంరెడ్డి మాట్లాడారు. పార్టీ గెలుపునకు కృషి వారికి, ఆదరించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, ప్రభాకర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, దుర్గయ్య తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా.. మండల పరిధి 48 పోలింగ్ కేంద్రంలో బీఆర్‌ఎస్‌కు 12,799 ఓట్లు, కాంగ్రెస్‌కు 13,140ఓట్లు వచ్చాయి. బీఎస్పీకి 521, బీజేపీకి 1030ఓట్లు వచ్చాయి.

ధూంధాం

బొంరాస్‌పేట: కాంగ్రెస్ పార్టీ కొడంగల్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి విజయంతో నియోజకవర్గంలోని బొంరాస్‌పే, దుద్యాల మండలాల్లో సంబురాలు అంబరాన్నంటాయి. డీజే పాటలతో హంగామా చేశారు. విజయానందంతో బాణసంచాలు కాలుస్తూ మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాల అధ్యక్షులు నర్సింహులు గౌడ్, ఆవుటి శేఖరయ్య, నాయకులు వెంకట్రాములుగౌడ్, రాజేశ్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, నర్సింహులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.


పూడూరులో..

పరిగిలో పట్టలేని ఆనందం..

పూడూరు: పరిగిలో కాంగ్రెస్ అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డి విజయం సాధించారు. దీంతో మండల పరిధిలో ఆ పార్టీ శ్రేణులు బాణాసంచాలు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డిపై 22,481 మెజార్టీతో తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి విజయదుందుభి మోగించారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకులు మాట్లాడారు. మండలం నుంచి 3,487పైగా మెజార్టీ ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, షకీల్, పెంటయ్య, డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అజీంపటేల్, వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు రాములు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలుపుకోవాలి


రేవంత్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నిరుద్యోగులు, డీఎస్సీ అభ్యర్థులు

వికారాబాద్ అర్బన్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో నిరుద్యోగులు, డీఎస్సీ అభ్యర్థులు రేవంత్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీఎస్సీ అభ్యర్థి రాములు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఎంతో మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటే.. అవహేళన చేసి మాట్లాడిన ఆ పార్టీ నాయకులకు నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులు చెంపపెట్టు లాంటి తీర్పును ఇచ్చి, ఇంటికి సాగనంపారని పేర్కొన్నారు. కాంగ్రెస్ మెనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేసి, నిరుద్యోగులకు న్యాయం చేయాలని వారు కోరారు.

నిమిషాల్లో నూర్పిడి!

- వరికోత యంత్రాలతో మేలు
- రైతులకు కలిసొస్తున్న సమయం
- మిగులుతున్న కూలీ డబ్బులు

షాబాద్: గతంలో వ్యవసాయం చేయాలంటే రైతులు ఎంతో వ్యయ, ప్రయాసాలకోర్చేవారు. కాడెడ్లతో అరక చేత పట్టి, పొద్దస్తమానం పొలం దున్నేవారు. విత్తనం వేసింది మొదలు పంట ఇంటికి చేరేదాక కూలీల అవసరం ఉండేంది. దీంతో రైతులు తన స్థోమత మేరకే పంటలను తక్కువ విస్తీర్ణంలో సాగు చేసేవారు. కానీ ఇప్పుడు మారు తున్న కాలంతో పాటు, పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో సాగు కొత్త పుంతలు తొక్కుతోంది. కాలంతో పాటు, వ్యయం తగ్గుతోంది!. సాగు యంత్రాలు యంత్రాలు అందుబాటులోకి రావడంతో పనులు సులువుగా, తక్కువ కాలంలో అయిపోతు న్నాయి. దీంతో పొలం పనులకు ఎక్కువగా యంత్రాలను వినియోగించేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు.

అద్దే గంటకు రూ.2,200

ప్రస్తుతం చిన్న మడి దున్నినా ట్రాక్టర్ సహాయంతో దున్నుతున్నారు. పంట విస్తీర్ణం పెంచుతూ అధిక దిగుబడిని సాధిస్తున్నారు. కొంతకాలం క్రితం వరకు వరి పంటను కూలీలతో కోయించి, నూర్పిడి కోసం యంత్రాన్ని వాడేవారు. ప్రస్తుతం యంత్రాలతోనే పొలంలోనే గంట పరిధిలో ఎకరా పొలాన్ని నూర్పిడి చేయిస్తున్నారు. ఈ విధానంతో రైతు ఒకేసారి ధాన్యం సంచులు నింపుకునే ఆస్కారం కలుగుతుంది. ఇందుకు గాను యంత్రానికి గంటకు అద్దే రూపేన రూ.2,200 చెల్లిస్తున్నారు. ఇలా యంత్రాల సాయంతో రైతు ఒంటిచేత్తో సాగు పనులను చేస్తుకొస్తున్నాడు. దీంతో వ్యవసాయ పనులకు ఉపయోగపడే యంత్రాలు రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో మండల కేంద్రంలో అందుబాటులో ఉన్నాయి.

పరిగిలో టీఆర్‌ఆర్ విజయం


బాణసంచాలు కాలుస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

- భారీ మెజార్టీతో గెలిచిన రామ్మోహన్‌రెడ్డి
- 22 రౌండ్లలో కొనసాగిన ఆధిక్యం
- కౌంటింగ్ మధ్యలో వెళ్లిన బీఆర్‌ఎస్ అభ్యర్థి మహేశ్‌రెడ్డి

పరిగి: 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పరిగి అభ్యర్థి తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి ఘన విజయం సాధించారు. సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థిపై 23,955 వేల ఓట్ల మెజార్టీతో విజయదుందుభి మోగించారు. ఆదివారం పట్టణ కేంద్రం మార్కెట్ యార్డులో నాలుగు నియోజకవర్గాల ఓట్లను లెక్కించారు. సెగ్మెంట్ పరిధిలో 305 బూత్‌లకు కౌంటింగ్ నిర్వహించగా.. ఒక్కో రౌండ్‌కు 14 టేబుల్స్ వేసి, 22 రౌండ్లను లెక్కించారు. మొదటి రౌండ్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మహేశ్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి ఆధిక్యం కనబరిచారు.

కాంగ్రెస్‌కు 23,955 ఓట్ల మెజార్టీ

మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించగా కాంగ్రెస్‌కు 1,899 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి మారుతికిరణ్‌కు 479, బీఆర్‌ఎస్‌కు 424 ఓట్లు రాగా.. 45 ఓట్లు చెల్లకుండా పోయాయి. మొదటి రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డికి 725 మెజార్టీ రాగా.. ప్రతి రౌండ్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యం పెరుగుతూ పోయింది. మొత్తం 22 రౌండ్లకు గాను కాంగ్రెస్‌కు 96,284 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 73,804 ఓట్లు, బీజేపీకి 16,118 ఓట్లు వచ్చాయి. ఇందులో పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి 23,955 ఓట్ల మెజార్టీతో (పోస్టల్ ఓట్లతో కలిపి) కాంగ్రెస్ విజయాన్ని కైవసం చేసుకుంది. లెక్కింపు జరుగుతుంగానే.. బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల కౌటింగ్ సెంటర్ నుంచి వెళ్లి పోయారు.

పార్టీలో టీఆర్‌ఆర్ కీలకం

టీఆర్‌ఆర్ పేరిట విద్యాసంస్థలు, వైద్యకళాశాల ఏర్పాటు చేసి ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు విద్యను అందించడంతో పాటు ఉచిత వైద్య సేవలను అందించిన రామ్మోహన్‌రెడ్డి.. 2006లో రాజకీయ అరంగేట్రం చేశారు. నాటి నుంచి నేటి వరకు పార్టీలో కొనసాగుతూ కీలక నాయకుడిగా ఎదిగారు. 2009లో పార్టీ టికెట్ నిరాకరించగా.. స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి, స్వల్ప ఓట్లతో ఓటమి పాలయ్యారు. అనంతరం 2014 కాంగ్రెస్ అధిష్టానం టికెట్ కేటాయించడంతో హరీశ్వర్‌రెడ్డిపై గెలుపొందారు. ఎంతో మంది పార్టీని వీడినా.. ఆయన కొనసాగుతూనే వచ్చారు. 2018 ఎన్నికల్లో ఓటమిని చవిచూడగా.. 2023లో విజయభావుటా ఎగురవేశారు.

సకుటుంబ సమేతంగా..

గత అనుభవాల నేపథ్యంలో ఈ సాధారణ ఎన్నికల్లో సకుటుంబ సమేతంగా పనిచేశారు. రేయింబవళ్లు ప్రచారంలో దూసుకుపోయారు. రామ్మోహన్‌రెడ్డి ప్రచారంలో ఉండగా.. ఆయన సతీమణి ఉమారెడ్డి.. కార్యకర్తలతో మమేకం అవుతూ ముందుకు నడిపించారు. టీఆర్‌ఆర్ తనయ మేఘనారెడ్డి, కుమారుడు రితిక్‌రెడ్డి సైతం ఆయనకు మద్దతుగా ప్రజా క్షేత్రంలోనే ఉన్నారు. ఇలా ఇంటిల్లిపాది కష్టానికి ప్రస్తుత ఫలితం ఒక కానుకగా చెప్పుకోవచ్చు.

పోరాట యోధుడికి పట్టాభిషేకం

నియోజకవర్గ ప్రజలు పోరాట యోధుడు రేవంత్‌కు పట్టం కట్టారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లోనూ రేవంత్‌రెడ్డికి ఆధిక్యత ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఉద్యోగులు సైతం పోస్టల్ బ్యాలెట్ ద్వారా కాంగ్రెస్‌కే మద్దతు ఇచ్చి.. రెండు జాతీయ పార్టీలైన బీజేపీ, బీఎస్పీలు డిపాజిట్లను కోల్పోయేలా తీర్పునిచ్చారు.


టపాకాయలు కాలుస్తూ సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు

- ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ ఆధిక్యం
- ఉద్యోగుల మద్దతు రేవంత్‌కే
- డిపాజిట్లు కోల్పోయిన బీజేపీ, బీఎస్పీ

కొడంగల్: రేవంత్‌రెడ్డి రాజకీయ జీవితంలో ఓటమిని ఎరగలేదు!. 2018 సాధారణ ఎన్నికల్లో అప్పటి టీఆర్‌ఎస్ అధిష్టానం అతికష్టం మీద 9వేల ఓట్ల తేడాతో రేవంత్‌ను ఓడించింది. అదొక్కటే ఆయనకు రాజకీయ ఓటమి. ఓడిన చోటనే గెలవాలనే పట్టుదలతో 2023లో పీసీసీ అధ్యక్షుడి హోదాలో కాంగ్రెస్ అభ్యర్థిగా కొడంగల్‌లో నామినేషన్ వేశారు. నామినేషన్ వేసిన తర్వాత ఆయన రెండు రోజులు మాత్రమే కొడంగల్‌లో ప్రచారం చేశారు. ఆ తరువాత బరువు బాధ్యతలు మొత్తం కొడంగల్ ప్రజలపై వేశారు. దీంతో సెగ్మెంట్ ప్రజలు ఆయన్ను 31,849 ఓట్ల మెజార్టీతో (పోస్టల్ ఓట్లు అదనం)గెలిపించారు.

ప్రతి రౌండ్‌లోనే పై'చేయే'

2023 సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపులో రేవంత్ తన సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డిపై విజయం సాధించారు. మొత్తం 20 రౌండ్లలో ఓట్లను లెక్కించగా.. ప్రతి రౌండ్‌లోనూ రేవంత్‌రెడ్డి ఆధిక్యం కనబరిచారు. మొదటి రౌండ్‌లో బీఆర్‌ఎస్ కంటే 1,365 ఓట్లు రాగా.. ఆ తర్వాత ప్రతి రౌండ్‌లోనూ మెజార్టీ పెరిగింది. రెండో రౌండ్ నుంచి 20వ రౌండ్ వరకు వరుసగా రేవంత్‌కు వచ్చిన మెజార్టీ ఇలా ఉంది. రెండో రౌండ్ నుంచి వరుసగా.. 1,148, 1,885, 1,289, 145, 584, 1,801, 1,136, 2,707, 1,948, 3,291, 1,609, 2,015, 1,708, 1,500, 1,626, 1,464, 2,604, 1,112, 972 ఓట్ల ఆధిక్యం వచ్చింది. నియోజకవర్గ పరిధి 8 మండలాల్లోనూ భారీ మెజార్టీ నమోదు అయింది.


కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి

పోస్టల్ బ్యాలెట్‌లోనూ ముందే..

మొత్తం పోలైన ఓట్లలో రేవంత్(కాంగ్రెస్)కు 1,06,558 ఓట్లు, పట్నం నరేందర్‌రెడ్డి(బీఆర్‌ఎస్)కి 74,709 ఓట్లు, బీజేపీ అభ్యర్థికి 3,928, బీఎస్పీ అభ్యర్థికి 2,114 వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌లోనూ రేవంత్ ఆధిక్యత కనబరిచారు. నియోజకవర్గ పరిధి ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో మద్దతు ఇచ్చారు. పోస్టల్ బ్యాలెట్‌లో రేవంత్‌కు 871, నరేందర్‌రెడ్డికి 188, బీజేపీకి 60, బీఎస్పీకి 19, ఇతరులకు 5, నోటాకు 3 ఓట్లు వచ్చాయి. లెక్కింపు ప్రక్రియ అనంతరం రేవంత్‌రెడ్డి గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని ఆయన సోదరులు తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, నందారం ప్రశాంత్, జయతీర్థాచారీలతో పాటు, పార్టీ ముఖ్యమైన నాయకులు రిటర్నింగ్ అధికారి లింగ్యా నాయక్ చేతుల మీదుగా అందుకున్నారు.

ట్రా'ఫికర్'

- మొయినాబాద్‌లో పెరుగుతున్న కష్టాలు
- రోడ్డుపైనే వాహనాల నిలిపివేత
- రాకపోకలకు ఇక్కట్లు

మొయినాబాద్: మొయినాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్ర మవుతోంది. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపైనే వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. ప్రధాన చౌరస్తాలో వాహనాలు ఎటు నుంచి ఎటు పోతున్నాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. నాలుగు వైపులనుంచి ఒకే సారి బండ్లు రావడంతో ఇబ్బంది పడుతున్నామని పాదచారులు వాపోతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా.. దానిని వినియోగించడం లేదని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణ సముదాయాల ఎదుట వాహనాల పార్కింగ్‌తోనే ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రధాన కూడలిలో ఉదయం పూట వందలాది మంది అడ్డా కూలీలు నిలబడతారు. దీంతో ట్రాఫిక్‌కు మరింత అంతరాయం ఏర్పడడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి.

బస్టాపుల్లో పార్కింగ్

ఇక్కడ బస్టాపుల్లోనే ఆటోలు నిలుపుతుండడంతో బస్సులు రోడ్డుపైనే ఆగుతున్నాయి. దీంతో వెనకాల వచ్చే వాహనాలు, వాటి వెనకాలే ఆగడంతో.. బస్సులు కదిలేంత వరకు ట్రాఫిక్‌లోనే ఉండాల్సిన పరిస్థితి. బస్టాపుల వద్దే బ్యాంకులు ఉండడంతో అక్కడికి వచ్చినవారు రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు.

అలంకారప్రాయంగా సిగ్నల్ వ్యవస్థ

ట్రాఫిక్ సమస్య తీర్చడం కోసం ఏర్పాటు చేసిన సిగ్నల్స్‌ను వాహనదారులు పాటించడం లేదు. సిగ్నల్ ఆపరేటింగ్ లేకపోవడంతో కూడలిలో నాలుగు వైపుల నుంచి పరుగెడుతున్న వాహనాలతో ట్రాఫిక్ జాం అవుతోంది. దీంతో వాహన దారులతో పాటు పాదచారులకు ఇబ్బంది తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను తీర్చాలని మండల కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ కంచుకోటకు బీటలు!

- కాంగ్రెస్‌కు మెజార్టీ కట్టబెట్టిన యాలాల ప్రజలు

యాలాల: 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి గెలిచారు. దీంతో పార్టీ మండల శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. బాణాసంచాలు కాలుస్తూ.. మిఠాయిలు పంచిపెట్టారు. యాలాల మండలంలో మొత్తం 48 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. ఇందులో మండలంలో ఉన్న 39,454 మంది ఓటర్లకు గాను, 31,151 మంది తమ ఓటు వినియోగించుకోగా.. బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి 13,881, కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యనికి 15,868 ఓట్లు వచ్చాయి. దీంతో 1,987 ఓట్లు మనోహర్‌రెడ్డికి అధికంగా వచ్చాయి.

మద్దతు ఇచ్చినా ఓటమి తప్పలేదు

యాలాల మండలాన్ని బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భావించేవారు. ఈ సారి సైతం అధికార పార్టీకి మండలంపైనే భారీ అంచనాలు ఉండేవి. గడిచిన నాలుగున్నరేళ్లుగా ఎమ్మెల్సీ వర్గం నాయకులు, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి దూరంగా ఉంటూ వచ్చారు. కాగా ఎన్నికల సమయంలో కొద్ది నెలల ముందు నుంచి రోహిత్‌కు మద్దతుగా నిలిచారు. ఎన్నికల ప్రచారం చేశారు. అయినప్పటికీ పైలెట్‌కు ఓటమి తప్పలేదు. మండల కేంద్రం నుంచి కాంగ్రెస్‌కు 186, మేజర్ పంచాయతీలైన అగ్గనూరు(190), కోకట్(60), పగిడియాల(314), దేవనూరు(289), జుంటుపల్లి(78), బెన్నూరు(66) నుంచి ఓట్లు అధికంగా పోలయ్యాయి. దీంతో మెజార్టీ సాధించి పెట్టాయి.


గిరిజాపూర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


మహేశ్వరం ఎమ్మెల్యేగా గెలిచిన సబితారెడ్డిని ఆదివారం ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపిన జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు –అనంతగిరి

యథేచ్ఛగా సెల్‌టవర్ల ఏర్పాటు

- రేడియేషన్‌తో హాని
- అనారోగ్యాల బారిన జనం
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: ఇప్పటి వరకు పరిశ్రమల ద్వారా వెలుడుతున్న కాలుష్యంతో మండల ప్రజలు రకరకాల రోగాల బారిన పడుతుండగా.. పుండు మీద కాలం చల్లినట్లుగా.. కొత్తగా ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్లతో మరిన్ని వ్యాధులు వచ్చి చేరుతున్నాయి. ఇటీవలి కాలంలో అనుమతులు లేకుండానే ఇళ్ల మధ్యలో కొత్తగా సెల్‌ఫోన్ టవర్లను ఏర్పాటు చేస్తున్నారు. సెల్‌టవర్ల సమీపంలో రేడియేషన్ ప్రభావం అధికంగా ఉంటుందని తరచూ ఆయా సందర్భాల్లో వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు మండల కేంద్రానికే పరిమితమయ్యే టవర్లు.. కంపెనీల మధ్య పోటీ పెరగడంతో కొత్త కస్టమర్లు, నాణ్యమైన సేవలు అందించాలనే దృక్పథంతో ప్రస్తుతం మారుమూల గ్రామాల్లో కూడా టవర్లను ఏర్పాటు చేస్తున్నారు.

ఇళ్ల మధ్య టవర్లతో..

ఇళ్ల మధ్య సెల్‌ఫోన్ టవర్లను ఏర్పాటు చేయడంతో రేడియేషన్ ప్రభావంతో సమీపంలో నివసించే ప్రజలు తరచుగా అనారోగ్యాలకు గురవుతున్నట్లు ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సర్వేలు, పలు వైద్య బృందాలు వెల్లడించాయి. రేడియేషన్ ప్రభావం ఎక్కువైతే పలు రకాలైన క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరించినా పట్టించుకునే వారు కరువయ్యారు. క్యాన్సర్ల బారిన పడిన కొందరు చికిత్సలు చేయించుకుంటున్నారు. మరికొందరు మృతి చెందారు. అంతేకాకుండా భారీ ఈదురుగాలులు వీచే సమయంలో పలుచోట్ల సెల్‌టవర్లు విరిగి ఇళ్లపై పడిన సంఘటనలు లేకపోలేదు. సెల్‌టవర్లతో అనేక వ్యాధులు వస్తున్నాయనే విషయం తెలియక ఇంటి యజమానులకు నెలనెల పెద్దమొత్తంలో అద్దె చెల్లిస్తుండడంతో వారు కిమ్మనడం లేదు.


జనావాసాల మధ్య టవర్ (ఫైల్)

పన్నులు సైతం చెల్లించని వైనం...

మండలంలో ఇప్పటికే పదుల సంఖ్యలో ఆయా కంపెనీల సెల్‌టవర్లను ఏర్పాటు చేశారు. కాగా అందులో కొందరు పంచాయతీల నుంచి అనుమతులు తీసుకోగా మరికొందరు నాయకులకు ముడుపులు అందించి టవర్లను ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం టవర్లను ఏర్పాటు చేసే ముందు నిర్వాహకులు మున్సిపాలిటీ, పంచాయతీల నుంచి అనుమతులు తీసుకోవాలి. అంతేకాకుండా సమీపంలోని ఇళ్ల ప్రజలు టవర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తే జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలి. దానికి తోడు ప్రతి సంవత్సరం ఒక టవర్ సామర్థ్యాన్ని బట్టి సంబంధిత పంచాయతీకి పన్నుల రూపంలో సుమారుగా రూ.10 వేలు చెల్లించాలి. కానీ మండలంలో చాలా వరకు టవర్ల నిర్వాహకులు పన్నులు చెల్లించడం లేదు. ఏది ఏమైనప్పటికీ ప్రజా ఆరోగ్యం దృష్ట్యా సెల్ టవర్ల ఏర్పాటు తగ్గించాలని పలువురు కోరుతున్నారు.


ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డులో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన టవర్ (ఫైల్)